# బొమ్మ - బొరుసు




కేతవరపు రాజ్యశ్రీ



మాజీమంత్రి మండలి బుద్ధప్రసాద్ చేతుల మీదుగా శ్రీకిరణ్ సాంస్కృతిక సమాఖ్య వారి 'ప్రజ్ఞాశ్రీ' బిరుదు ప్రదానం.

ధర్మకేతనం సాహిత్య కళాపీఠం నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ కవి కొలకలూరి ఇనాక్ గారిచే సత్కారం.





ఊహల వసంతం కవితా సంపుటికి నెల్లూరు 'సృజన సాహిత్య వేదిక' వారిచే రాష్ట్రస్థాయి ఉత్తమ కవితా సంపుటిగా సత్కారం.

డా॥ అక్కినేని నాగేశ్వరరావుని జన్మదిన సందర్భంగా సత్కరిస్తున్న దృశ్యం.



# బొమ్మ - బొరుసు

( వ్యంజకాలు )

కేతవరపు రాజ్యశ్రీ

సాహితీ కిరణం ప్రచురణలు

# బొమ్మ - బొరుసు (వ్యంజకాలు)

ప్రథమ ముద్రణ : ఫిబ్రవరి -2012

వెల : రూ. 50/- లు

సర్వహక్కులు రచయితవి

డి.టి.పి. & కవర్ డిజైన్
**రామకృష్ణ,**
**అలకాపురి, హైదరాబాద్.**

ప్రింటింగ్
**వివేక్ ప్రింటర్స్, విద్యానగర్**

ప్రతులకు :
**కేతవరపు రాజ్యశ్రీ**
ఫ్లాట్ నెం.301, గోకుల్ అపార్ట్‌మెంట్స్
స్ట్రీట్ నెం.4, అశోక్ నగర్, హైదరాబాద్ -20
ఫోన్: 040- 27670267,సెల్ : 8500121990
ఇ-మెయిల్ : mrajyasri@rediffmail.com

**సాహితీకిరణం కార్యాలయం**
11-13-154, రోడ్ నెం.3
అలకాపురి, హైదరాబాద్ - 500 035

# అంకితం



కవిత కథ జతకట్టి

ఆత్మీయత అనురాగం తోడైన దంపతులు

శ్రీ పొత్తూరి సుబ్బారావు శ్రీమతి జయలక్ష్మి గార్లు

నాకు అత్యంత ఆత్మీయులైన వీరి పరిమళ స్నేహానికి గుర్తుగా



**సుధామ**
జి-12, సాధత్ టవర్స్, పద్మావతి అపార్ట్‌మెంట్స్
సలీంనగర్ కాలనీ, మలక్‌పేట, హైదరాబాద్ -36
సెల్ : 9849297958

# రెండంచుల నాణేల మూట- వ్యంజకాల మాట

కవిత్వం లఘురూపాలలోకి ఒదిగిపోతున్న కాలం ఇది. 'విస్తృతకి 'విస్మృతి' సంభవించి, చదవడానికీ, గుర్తు పెట్టుకోవడానికీ.. క్లుప్తతను- వేగవంతమైన కాలమాన పరిస్థితుల దృష్ట్యా కూడా స్వీకరిస్తున్న అనివార్యత! మినీ కవిత్వం నానీలుగా, రెక్కలుగా రూపందాల్చి – ఎందరికో కవులుగా ఆకృతినిచ్చింది! కాలాను గుణంగా 'రూపం' మారుతుంది. అది సహజం! వ్యక్తి రూపు మారడం ఎంత సహజమో, సాహిత్యరూపాలు కూడా అంతే సహజం అనుకోవచ్చు.

'సాహితీకిరణం' మాసపత్రిక సంపాదకులు శ్రీ పొత్తూరి సుబ్బారావు ఈ 'వ్యంజకాలు' ప్రక్రియ ప్రారంభించారు. నిజానికి ప్రాచీనాలంకారికులు పదములకు లేక శబ్దములకు అర్థమును బోధించే ఒక శక్తి వుందనీ, ఆ పదపదార్థ సంబంధశక్తినే 'వృత్తి' 'శక్తి', 'వ్యాపారం' అని పేర్లతో ఉటంకించారు. ఆ శక్తి అభిధా, లక్షణ, వ్యంజన అని మూడు రకాలు. 'వాచకము' లేక 'శక్తము' అయిన శబ్దము చేత 'వాచ్యము' లేక

'అభ్యుదయము' లేక 'శక్యము' అయిన అర్ధమునిచ్చేది 'అభిధా' అనీ, 'లక్షకము' అయిన శబ్దంచేత 'లక్ష్యము' అయిన అర్థానిచ్చేది 'లక్షణా' అనీ, 'వ్యంజకము' అయిన శబ్దము చేత వ్యంగము అయిన అర్ధనిచ్చేది వ్యంజనా శక్తి అనీ ఆలంకారికులు పేర్కొన్నారు. పొత్తూరి సుబ్బారావు గారు 'వ్యంజనాలు' అనకుండా మరి 'వ్యంజకాలు' అనే అన్నారు. ఎందుకంటే వ్యంగ్యము, అధిక్షేపము మాత్రమే కాక – ఒక లోకరీతినీ, సామాజిక వైఖరినీ నాణేనికి – ఒక బొమ్మవైపే కాక, బొరుసువైపుతో చూపుతూ, విలువను అనుసంధానం చేయడం ఆయన ఉద్దేశ్యం. వ్యంజనా అనడంలో శక్తి వుంది. వ్యంజకం అనడంలో శబ్దాలకూ, పదాలకూ ప్రాముఖ్యం ఇచ్చి, నేటి కాలరీతు లకనుగుణంగా అభివ్యక్తి పదప్రయోగం చేయగల వైచిత్రి వుంది! మొదటి రెండు పంక్తులలో ఒక అంశాన్ని చెప్పి, మిగతా రెండు పంక్తులలో సమన్వయం చేయడానికి – ఆ పాజిటివ్‌కు, నెగిటివ్ అభివ్యక్తిని జోడించడం ఈ వ్యంజకాలు లోని ప్రయోగం! అంటే మొదటి రెండు పంక్తులూ సహజ ప్రకృతిని చెబితే, తదనంతర రెండు పంక్తులు వికృతి స్వభావాన్ని కూడా ముందుంచుతూ మొత్తంమీద మొత్తం నాలుగు పాదాల్తూ కలిసి బొమ్మబొరుసూ కలిసిన నాణెంలా ఒక సమష్టివిలువను సంతరించు కోవాలన్నది సంకల్పం! రెండంచుల నాణేల మూట ఈ వ్యంజకాలన్న మాట!

' సాహితీ కిరణం'లో నెలనెలా ఈ వ్యంజకాలు విరివిగా ప్రచురింపబడుతున్నాయి. సహజంగా కొత్తదనం పట్ల ఆసక్తి, కవిత్వరచనానురక్తి కల శ్రీమతి కేతవరపు రాజ్యశ్రీగారు మునుపే నానీలు, రెక్కలు వెలువరించి, ఈ 'వ్యంజకాలు' పట్ల ఆసక్తి కలిగి, పొత్తూరి సుబ్బారావు గారి కన్నా ముందే పుస్తక రూపంలోకి తీసుకు వస్తూండడం అభినందనీయం! ఒక క్రియకు ప్రతిక్రియ, ఒక ప్రకృతికి వికృతి, ఒక

స్థితికి దుస్థితి, ఒక మేలుకు ఒక కీడు ఒక సంతోషానికి ఒక దుఃఖం లోకంలో సహజం. 'వ్యంజకాలు' ఆ అర్థాలను శబ్దించేవే. అభివ్యక్తీకరించేవే రాజ్యశ్రీగారు తన పరిశీలనాశక్తితో సామాజిక చేతనతో, కాలరీతులనూ, మనుష్యస్వభావాలనూ ఈ వ్యంజకాలలో చక్కగా పట్టుకున్నారు.

అపార్టుమెంట్ నిర్మాణం
ఎందరికో ఉపాధి కల్పించింది
నిరుపేదలకు
నిలువనీడపోయింది.

అనడంలో పేదల గుడిసెలు కూల్చి బహుళ అంతస్తుల భవనాలు నిర్మితమౌతున్న అమానవీయ సంస్కృతికీ అద్దం పట్టినట్లయింది.

పెళ్లికూతురు
అందాలరాశి
కట్నకానుకలు తేలేని ఆమెను
అవిటికించే లెక్కకట్టారు

మెగుడు వదిలేసినా కాయకష్టంచేసి
కొడుకును బడిలో వేసింది
అడ్మిషన్ ఫామ్‌లో
నాన్న పేరు రాయమన్నారు

వంటి వాటిల్లో 'స్త్రీవాదం' తొంగిచూసేలా చేయడం రాజ్యశ్రీప్రత్యేకత! ఇది స్త్రీగా కవయిత్రి లక్షణం!

అమ్మానాన్నలు
బండిచక్రలవంటివారు
బండిపై బరువును మోపటానికీ
కొందరు పిల్లలు ప్రయత్నిస్తుంటారు

విదేశీ సంపాదనతో

స్వదేశంలో విలాసవంతమైన ఇళ్లు

వాటికి కాపలాగా

వయసుమళ్లిన మాతాపితలు

వంటి 'వ్యంజకాలు' వట్టి వ్యంగ్యార్థ సూచకాలే కాదు, నేటి మృగ్యమౌతున్న మానవీయవిలువలను కనులముందుంచి, చెమరింపచేసేవి. "రమణీయార్థ ప్రతిపాదక శబ్ద" మేదయినా కావ్యమేనని 'జగన్నాథుడు' అన్నాడు. కావ్యశరీరలక్షణం – అనగా రూపును ముందు గ్రహిస్తే, ఆ రూపు నుండి రూపుకట్టే– కావ్యాత్మవైపు ప్రయాణం చేయగలుగుతాం! 'వ్యంజకాలను రూపొందించిన శ్రీ పొత్తూరి సుబ్బారావు గారికీ, ఆ ప్రక్రియ నంది పుచ్చుకుని మొదట తానే గ్రంథ రూపంలో వెలువరిస్తున్న శ్రీమతి కేతవరపు రాజ్యశ్రీ గారికి అభినందనలు.

సదా

మీ

సుధామ



భారత్ భాషాభూషణ్
**డా॥ తిరునగరి**
6-17/5, డి.నగర్,
చింతల్ హెచ్.ఎమ్.టి, హైదరాబాద్ -500054.

# చేయి తిరిగిన కవయిత్రి

అత్యాధునిక యుగంలో తెలుగు కవిత్వంలో నూతన ప్రక్రియలు అతివేగంగా పుట్టుకొస్తున్నై వచన కవిత్వం మూడు దశాబ్దాలపాటు కవుల ఆదరణను పొందింది. వేగవంతమైన కాలంలో దీర్ఘ వచన కవితలను చదివే ఓపిక పాఠకులకు లేదు. ఈ దశలో నూతన రచనా మార్గాలను కవులు ప్రవేశపెట్టారు. మినీ కవితలో అనేక పేర్లతో చిన్న కవితా ప్రక్రియలు ఆవిర్భవించినై అలావచ్చిన ప్రక్రియ వ్యంజకాలు. దీని రూపశిల్పి శ్రీ పొత్తూరి సుబ్బారావు ఆయన సంపాదకత్వంలో వెలువడుతున్న 'సాహితీ కిరణం' మాసపత్రికలో ఒక శీర్షికనే ప్రారంభించారు సుబ్బారావు. ఎందరో యువకవులు, కవయిత్రులు వ్యంజకాలు రాస్తున్నారు. ఆ ప్రవరలో ఒకరు కేతవరపు రాజ్యశ్రీ, రాజ్యశ్రీ ప్రసిద్ధ కవయిత్రి. భావగర్భితమైన వ్యంజకాలు రచించారు. ఒక అంశాన్ని మొదటి రెండు వాక్యాలలో చెప్పి, తరువాత రెండు వ్యాక్యాలలో దాన్ని అధిక్షేపించడంద్వారా ఒక వైచిత్రిని సాధించడం వ్యంజక ప్రక్రియలోని విశేషం. కేతవరపు రాజ్యశ్రీ ప్రసిద్ధ కవయిత్రి ఇప్పటికే

ఆరు కవితా సంపుటాలను ప్రచురించారు. ఇప్పుడు వ్యంజకాలు శతకాన్ని రచించారు.

అవి 1. చిరుసవ్వడులు 2. గుండె చప్పుళ్ళు 3. ఊహల వసంతం 4. సిసింద్రీలు 5. వెన్నెలమెట్లు 6. తృప్తీనీవెక్కడ? 7. నీలోకి నువ్వు.

స్వదేశంలో వదలిపెట్టి అమెరికావంటి విదేశాల్లో విలాసవంతంగా బతుకుతున్న కొడుకుల నిర్వాకాన్ని ఎండగట్టిన వైనం.

విదేశీ సంపాదనతో
స్వదేశంలో విలాసవంతమైన ఇళ్ళు
వాటికి కాపలాగా
వయసుమళ్ళిన మాతాపితలు

స్వచ్ఛమైన పాలను
ఇస్తుంది పశువు
వాటిని కల్తీచేసి
అమ్ముతాడు నరపశువు
ఇక్కడ నరపశువుకన్నా పశువునయమన్న భావన

సముద్రపు అలల సయ్యాట
ఎంతో ఆహ్లాదకర దృశ్యం
ఆ అలలు తీరం దాటితే
ప్రకృతి విలయ తాండవం

వ్యాఖ్యానం అవనరంలేని వ్యంజకం. వ్యంజకం లక్షణం

తెలుసుకోవడంకోసం ముచ్చటగా మూడింటిని ఎత్తి చూపించారు.

ఎంత వచన కవిత్వమైనా కవి సమర్ధుడైతేనే అది కవిత్వంగా గుబాళిస్తుంది. అది ప్రక్రియ అయినా కానీ రాజ్యశ్రీ భావ శబలతా, అభివ్యక్తి రమ్యతాగల చేయితిరిగిన కవయిత్రి. కాబట్టే ప్రక్రియ ఇంకా ప్రయోగదశలోనే ఉన్నా కవితలు కదిలించేవిగా ఉన్నై.

'వ్యంజకాలు' ప్రక్రియ బలపడడానికి ఇటువంటి రచనలు దోహదం చేస్తై వ్యంజకాలలో మంచి కవిత్వాన్ని అందించిన రాజ్యశ్రీని అభినందిస్తున్నారు. ఆమెకు ఉజ్వల భవిష్యత్తు నాకాంక్షిస్తున్నారు.

**- డా॥ తిరునగరి**



**పొత్తూరి సుబ్బారావు**
11-13-154, రోడ్ నెం.3
అలకాపురి, హైదరాబాద్ - 500 035
సెల్. 9490751681

# కృతజ్ఞతాభినందనలు

తెలుగు సాహితీరంగం , ముఖ్యంగా కవితా రంగం నాటి నుండి నేటి వరకు అనేక సరిక్రొత్త ప్రక్రియలతో ముందుకు సాగిపోతున్నది. అసలు నిజంగా ఆలోచిస్తే నూతన ప్రక్రియకు ఆద్యం పోయటం అనేది నేటి ఆధునిక సాహిత్యంలోనే కాదు ప్రాచీన కాలం నుండి వస్తున్నదే. ఛందోబద్ధమైన పద్య కవితను పామరులు చదివి అర్థం చేసుకోలేని నాటి రోజుల్లోనే పద్య కవిత్వానికి భిన్నంగా శతక కవిత్వానికి అంకురార్పణ కావించటం జరిగింది. నాలుగు పాదాలుండే శతక పద్యంలో మూడు పాదాలలో మాత్రమే అర్థం స్ఫురిస్తుంది. ఆ మూడు పాదాలలో సైతం రెండు భిన్న పార్శ్వాలు అగుపిస్తాయి. ముఖ్యంగా వేమన పద్యాన్ని తీసుకుంటే

" మేడి పండు చూడ మేలిమై యుండును
పొట్ట విచ్చిచూడ పురుగులుండు"

ఆరెండు పాదాలే వ్యంజకాలు. అనే నూతన ప్రక్రియకు

స్ఫూర్తినిచ్చాయి. 9 మే 2010న గుంటూరు జిల్లా చిలకలూరి పేట (గణపవరం) లో గుంటూరు జిల్లా రచయితల సంఘం ఏర్పాటు చేసిన శతాధిక కవిసమ్మేళనంలో పాల్గొనడానికి ముందు రోజు నేను నాలుగు కవితలు మొదటి రెండు పాదాలు అనుకూల వాదాన్ని, తదుపరి రెండు పాదాలు ప్రతికూల వాదాన్ని సూచించే విధంగా రాసి మినీ కవితల్లో ఇటువంటి నూతన ప్రక్రియను ప్రవేశపెడితే బాగుంటుందని నా దగ్గరకు అప్పుడు వచ్చిన సాహితీ మిత్రులు వూసల రజనీగంగాధర్‌తో చర్చించి ఈ ప్రక్రియకు 'వ్యంజకాలు' అని పేరుపెట్టటం జరిగింది. ఆ వ్యంజకాల గురించి విశదీకరించి నేను రాసిన వ్యంజకాలను శతాధిక కవి సమ్మేళనంలో చదవటంతో కవుల నుండి మంచి స్పందన లభించింది. జూన్ 2010 'సాహితీకిరణం' మాసపత్రిక నుండి వ్యంజకాలను ప్రతినెలా ప్రచురించటం ఆరంభించటంతో అనేక మంది కవులు ముందుకు వచ్చి వ్యంజకాల రచనకు ఉపక్రమించారు. నాటి నుండి నేటి దాకా సాహితీ కిరణంలో 465 వ్యంజకాలు ప్రచురిం చబడ్డాయి. కొందరు కవులు ముఖ్యంగా కేతవరపు రాజ్యశ్రీ రాసిన వ్యంజకాలు ఇతర పత్రికలలో కూడా ప్రచురించబడ్డాయి. అన్నీ కలిపితే ఇప్పటికి దాదాపు 500 వ్యంజకాలు తెలుగు సాహితీవనంలో వికసిస్తున్నాయి.

ఇటువంటి వ్యంజకాల రచనలో అందిరికన్నా తాను ముందజ వేసి కేతవరపు రాజ్యశ్రీ అష్టోత్తరశత వ్యంజకాలతో పుస్తకాన్ని ప్రచురించటం ముదావహం. తెలుగు సాహితీరంగంలో రాజ్యశ్రీ 'బొమ్మ - బొరుసు ' తొలి వ్యంజకాల సంపుటిగా నిలిచిపోనున్నది. ఇటువంటి సంపుటిని వ్యంజకాలకు సృష్టికర్తగా నన్ను గౌరవించి మా దంపతులకు అంకితమివ్వటం చాలా సంతోషదాయకం. అందుకు నాకృతజ్ఞతాభి నందనలు తెలియపరుస్తూ వీరి అడుగుజాడల్లో మరి కొంత మంది వ్యంజకాల సంపుటాలను ప్రచురించి తెలుగు కవితా రంగాన్ని సుసంపన్నం చేస్తారని ఆకాంక్షిస్తూ.....

**- పొత్తూరి సుబ్బారావు**



**పాన్నాడ కుమార్**
ఫ్లాట్ నెం. 201, జమునా ఆర్కేడ్
లాసన్స్ బే కాలనీ, విశాఖపట్నం - 17
సెల్. 9246627839

# అక్షరాశీస్సులు

రాజ్యశ్రీగారంటె రమణీయకవిత
కేతవరపువారి గృహిణి యీమె!
కేతవరపు వారి గృహిణీమణియనిన
రాజధాని తెలుగురమణి యీమె

రాజధాని తెలుగు రమణీమణియనిన
ముగ్గురమ్మల వరపుత్రి యీమె!
ముగ్గురమ్మల వరపుత్రి రత్నమనిన
కలిమి, బలిమి వాణి లలనయీమె!

కలిమి, బలిమి, వాణిలలనామణియనిన
తెలుగుపదకవితా వెలదియీమె!
తెలుగుపదకవితా వెలదియేయన్నచో
నవకవుల తలలో నాల్కయీమె!

నవకవుల తలలోనాల్కయేయన్నచో
పూర్వానుభవ కావ్యముదితయీమె!
స్త్రీబాలవృద్ధుల చెలిమితో సభలందు
కావ్యరసము చిందుకాంతయీమె!

కలమును నిరతము హలముగా వాడిన
సాహితీ సుక్షేత్రశ్రమణియీమె!
సామాజిక స్పృహతో మంచిరచనలు
సాగించు 'ఆంధ్రావిశార' దీమె!

ఇట్టిసృజనాత్మ రాజ్యశ్రీకెవరుసాటి!?
వివిధ సాహితీ ప్రక్రియల్ విదుషి ఈమె!
అక్షరాలను పలికించి నట్టియీమె,
పలుకు పలుకున పలికిన పలుకలమ్మ!
చరిత సౌందర్య భాషాప్రసారణ ఘృణి
సాహితీ కిరణానికి చాంద్రియీమె!!

స్వీయరచనా కవితల సుశ్రీవిఖ్యాతి
ఈ కలంకారిణి కవితా కృతినిర్వాసె
'తృప్తి! నీవెక్కడ!?' యను దాని నిపుడు
సకల సాహితీ బుద్ధప్రసాదు గారు
అమృత వాక్కుల దీవెనలందజేసి
గ్రంధసుందరినావిష్కరణ మొనర్చె

ముఖ్యఅతిథిగా అరుణమ్మ మోదమంది
మృదుమధుర వాగమృతము చిలికి
మాన్య రాజ్యశ్రీకి శుభకామనలు తెలిపి,
నాటి సారస్వత సభలో తేటి యగుచు

ప్రాజ్ఞియైనట్టి ఆంధ్రుల రాజ్యశ్రీకి
ఈ కవికుమారు నాశీస్సులివియె నేడు
శ్రోతలెల్లరు సభగూడి శుభముపలుక
అందరకు పేరు పేరున వందనాలు!

**- పొన్నాడ కుమార్**



**కేతవరపు రాజ్యశ్రీ**
సెల్ : 8500121990

# మనసులో మాట

నా కవితాయానంలో ఇది ఎనిమిదవ పుస్తకం. ప్రతి కొత్త ప్రక్రియలోనూ కవితలు రాయాలని అనిపిస్తుంటుంది. నానీలు, రెక్కలు, మినీ కవితలు, వచన కవితలు, ఆధ్యాత్మిక వ్యాసాలు ఇలా సాగింది ఇప్పటిదాకా నా రచనా వ్యాసంగం. ఇప్పుడు ఈ కవితా సంపుటి "బొమ్మా – బొరుసు" లో వ్యంజకాలు రాశాను. "వ్యంజకాలు" అనే ప్రక్రియ శ్రీ పొత్తూరి సుబ్బారావు గారి మానస పుత్రిక... వారి సంపాదకీయంలో వెలువడుతున్న "సాహితీ కిరణం" మాస పత్రికలో చాలా మంది కవులు వ్యంజకాలు రాసారు. అందులో నావి కూడా వున్నాయి. అలా రాసిన వ్యంజకాలు బాగున్నాయి అని పలువురు ప్రశంశించడంతో, అది స్ఫూర్తిగా వ్యంజకాలు రాసి వివిధ సాహితీ పత్రికలకు పంపడం ప్రచురింపబడటం జరిగినది. వాటినన్నింటినీ కూర్చి పుస్తక రూపంలో వెలువరించడం జరిగింది. చాలా మంది వ్యంజకాలు రాస్తున్నా, వ్యంజకాలు మీద పుస్తకం

వెలువరించడంలో నాది ప్రప్రథమ స్థానమని చెప్పడానికి సంతోషంగా వుంది. వీటిని ఎప్పటిలాగే పాఠకులు ఆదరిస్తారని ఆశ.

తాను సృష్టికర్తయినా, తనకంటే ముందు నేను పుస్తకాన్ని ప్రచురించడం చాలా సంతోషంగా వుందంటూ నన్ను ఉత్సాహపరచి ప్రోత్సహించినందుకు, కృతిస్వీకరించడానికి అంగీకరించినందుకు శ్రీ పొత్తూరి సుబ్బారావు శ్రీమతి జయలక్ష్మి దంపతులకు,

అభిప్రాయం చెప్పమని అడిగిన వెంటనే నా వ్యంజకాలు చదివి "చేయి తిరిగిన కవయిత్రి" అంటూ ఆశీర్వదించి అభినందించిన భారత్ భాషా భూషణ్ డా॥ తిరునగరి గారికి,

అడిగిన వెంటనే తన ఆశీరభినందనలు అందించిన ప్రముఖ కవి, విమర్శకులు సుధామ గారికి,

నన్ను అభిమానిస్తున్న సాహితీ సాంస్కృతిక సంస్థలకు, పాఠకులకు, పత్రికా ప్రతినిధులకు, సాహితీ మిత్రులకు మన:పూర్వక కృతజ్ఞతలు.

రోడ్లనిండా చీమల బారులల్లే కార్లు
దేశ పురోగతికి చిహ్నాలు
స్వచ్ఛమైన ప్రాణవాయువుకు
ప్రతిబంధకాలు

కాపీకొట్ట కూడదంటూ
గాంధీజీ ఆదర్శం మీద పాఠం
స్కూలు తనిఖీ అధికారి రాగానే
పక్కవాడిది చూచి రాయమని ప్రోద్బలం

కవి సమ్మేళన వేదిక
కవులతో కళకళ లాడుతోంది
శ్రోతలు లేక
సభ వెలవెల పోతోంది

సముద్రపు అలల సయ్యాట
ఎంతో ఆహ్లాదకర దృశ్యం
ఆ అలలు తీరందాటితే
ప్రకృతి విలయతాండవం.

అతడి వ్యాపారం ఎప్పుడూ
మూడు పువ్వులూ ఆరుకాయలు
అతడు చేస్తున్నది
దిష్టి బొమ్మల వ్యాపారం మరి!

చిన్న కుటుంబం
చింతలులేని కుటుంబం
ఆలనాపాలనా చూసేవారులేక
పిల్లలు మాత్రం చింతాక్రాంతులు

వార్తా పత్రికలు మోసుకొచ్చే
తాజావార్తల కోసం ఆత్రంగా ఎదురుచూపులు
వార్తల్లోని అక్షరాలు
రాత్రంతా మిషన్లకిందనలిగిపోతాయి

ట్యాంక్ బండ్‌పై మహనీయుల విగ్రహాలు
జాతి గౌరవానికి చిహ్నాలు
వుద్యమాల ఆగ్రహ జ్వాలలకు
బలిపశువులైనాయి

అతడో ప్రఖ్యాత
పండితోత్తముడు
తన పాండిత్యం చాటుకోవడానికి
వెండితెరకు అమ్ముడుపోయాడు

విశ్వనాథ రామాయణ కల్పవృక్షం
మనుగడ తెలిపే మహాభాష్యం
రంగనాయకమ్మ విషవృక్షం
మానవతా విలువల పతనం

మంచిర్యాంకులు వస్తాయని
కార్పొరేట్ కాలేజీల్లో చేర్పించారు
పిల్లలతోబాటు అమ్మనాన్నలక్కూడా
కంటినిండా నిద్ర కరువయింది

ఆగర్భ శ్రీమంతురాలని
మురిసి పెళ్లి చేసుకున్నాడు
చీపురు పట్టుకుని
ఇల్లు వూడ్వడం నేర్చుకున్నాడు

ఆధునిక పరికరాలన్నీ
కొన్నారు ఇంటికోసం
వాటితో పనిచేయించడం కోసం
పనిమనిషిని పోషిస్తున్నారు

నవ్వుతూ బ్రతకాలి
నవ్వుతూ చావాలంటారు
నవ్వుతుంటే చూడలేక
నవ్వునాలుగువిధాలచేటంటారు

వేదికనెక్కి నేతలు
నీతి సూత్రాలు బోధించారు
సభ ముగియగానే
పదవుల కోసం కుమ్ములాటలు

చెట్లు నాటమని
పర్యావరణ పాఠాలు
రోడ్ల విస్తరణలో
అవే మొదటి సమిధలు

మహిళాభ్యుదయం మీద
ఉపన్యాసాలు, సత్కారాలు
గుమ్మంలో అడుగిడుతూనే
ఇల్లాలిని తిట్లు, శాపనార్ధాలు

సంస్కరణలు తీసుకురావాలని
ప్రతి ఒక్కరి ఆశయం
ఎవరైనా నడుంబిగించగానే
సమాజం నుంచి వెలివేత

నాటకం వేయడానికి
నటీనటులకు రిహార్సల్స్
రాజకీయ నాయకులు
డైరెక్ట్‌గా నాటకాలాడుతారు

పేరు ప్రఖ్యాతులు గడించిన
సంగీత విద్యాంసురాలు
గృహసీమలో ఆమె
మూగబోయిన కోయిల

ఆమె అందం
గులాబీల సౌకుమార్యం
చూపులు మాత్రం
ముళ్లలా గుచ్చుకుంటాయి

మొగుడు వదిలేసినా కాయకష్టం చేసి
కొడుకును బడిలోవేసింది
అడ్మిషన్‌ఫామ్‌లో
నాన్నపేరు రాయమన్నారు

ఎయిర్‌కండిషన్ గదిలో
పట్టుపాన్పు మీద పవ్వళించాడు
కంటినిండా నిద్ర అతడిని
వరించలేదు

అపార్టుమెంటు నిర్మాణం
ఎందరికో ఉపాధి కల్పించింది
నిరుపేదలకు
నిలువనీడ పోయింది

ఆకలి కేకలు విని

బిక్ష వేద్దామని వెళ్లా!

అతడి జోలెనిండుగా

పంచభక్ష్యాలు

స్వేచ్ఛగా బతకాలని

కలలుకన్నాడు

సమాజానికి భయపడుతూనే

జీవితం ముగించాడు

కవిత్వంలో చూపిస్తారు

ఎన్నో ఆదర్శాలు

నిజ జీవితంలో వాటికి

లేదు చోటు

చట్టం నుంచి
ఎవరూ తప్పించుకోలేరు
భయమేలా! చట్టం
అయినవాళ్ల చుట్టమేగా!

ప్రేమ కావ్యాలెన్నో రాసి
వాసికెక్కాడతడు
ప్రేమ పొంద లేక
నిస్సారంగా జీవిస్తున్నాడు

ప్రమాదాలు నివారించడానికి
సిగ్నల్ లైట్స్ ఉపయోగపడతాయి
పోలీసు మామ లేకుంటే
వాటినెవ్వరూ లెక్కచెయ్యరు

కులనిర్మూలమయితేనే
సమసమాజస్థాపన జరుగుతుందంటూ భాషణ
తమ కులపోడికి సీటివ్వకపోతే
రాష్ట్రాన్ని కుంపటి చేస్తానన్నాడు

అతని పాండిత్యానికి కొలబద్దగా
గండపెండేరాలు
దారిద్ర్యం అతని
పేగులు పిండేస్తోంది

వరకట్నం తీసుకోవడం
మా ఇంటా వంటా లేదన్నారు
లాంఛనాలు మాత్రం
ఘనంగా జరిపించమన్నారు

ప్రతిఫలాపేక్ష లేకుండా
జీవించాలని రచనలు చేశాడు
తన రచనలకు పారితోషిక
మిప్పించమని వేడుకోలు

ఆస్తిపాస్తులన్నీ పిల్లల పేర రాసి
తృప్తిగా కన్నుమూద్దామనుకున్నాడు
కానరాని జబ్బువచ్చి
అప్పు మిగిల్చి మరీ పోయాడు

శృంగార కథలెన్నోరాసి
సంపాదనలో మునిగిపోయాడు
సంసారం పట్టించుకోక
ఆలిని దూరం చేసుకున్నాడు

కారులో షికారు కెల్దామని
హుషారుగా బయలుదేరాము
సిగ్నల్ పడగానే బిచ్చగాళ్ల
వికృత చేష్టలకు మనసు వికలమయింది

శుభకార్యముందని ప్రహరీ గోడకు
తెల్లటి రంగువేయించా!
తెల్లారేసరికి రకరకాల ప్రకటనలు
దర్శనమిచ్చి రూపు లేకుండా అయింది

ఖరీదయిన కాన్వెంట్‌లో
సీటుసంపాదించామని గర్వపడ్డారు
ఇల్లూ పొలమూ
తాకట్టు పెట్టామని మరిచారు

కార్తీక మాసంలో
వనభోజనాల సంబరాలు
సహపంక్తి భోజనాలకి
కులాలవారీగా రమ్మని ఆహ్వానాలు

విదేశాల్లోని పిల్లలు పంపుతున్నారు
రకరకాల సౌందర్యసాధనాలు
వయసుకి డై చేసుకుని
పబ్బుల్లో డాన్సులు

పున్నమి చంద్రుడి పేరు మీద
ఎన్నో నోములూ వ్రతాలూ చేస్తారు
సూపర్ మూన్‌లా కాస్త కిందకి దిగేసరికి
ప్రపంచానికి అరిష్టమంటూ గగ్గోలు

ప్రేమజంట ముచ్చట్లకు
ఆహ్లాదకరం టాంక్‌బండ్
ప్రేమ వికటించిన జంటలకు
ఆత్మహత్యల నిలయం

పుస్తకాల మధ్య నెమలీక
బాల్యంలోని తీపిగుర్తులకు ప్రతీక
వెట్టిచాకిరీలో నలిగిపోయే
చిన్నారులకి బాల్యమే లేదు

నాయకుల వెనుక గనెమెన్‌లు
హోదాకి చిహ్నాలు
ఒక్కొక్కసారి వారి చేతుల్లోనే
వీరికి మరణం

పెళ్లికూతురు
అందాలరాశి
కట్నకానుకలు తేలేని ఆమె
అవిటికిందే లెక్కకట్టారు

వరుణయాగ ఫలితంగా
విస్తృతంగా వర్షాలుకురిశాయి
వూళ్లకివూళ్లు మునిగిపోయి
ప్రజలకు నిలువ నీడ కరువయింది

తరగని ఆస్థిపాస్తులున్నాయని
సుఖ జీవనం సాగించాడు
సుఖ రోగాలు చుట్టుముట్టి
జీవన్మృతుడయాడు

అమ్మాయి పెళ్లి ఎంతో ఘనంగా
ఆనందంగా చేశారు
అల్లుడివెంట పంపుతుంటే
హృదయాలు విషాదంతో బరువెక్కాయి

పదవిలో వుండగా
చుట్టూరా ఎందరో ఆత్మీయులు
పదవి పోగానే
అందరూ మొహం చాటేసేవారే!

ప్రపంచాన్ని జయించి
చరిత్రలో నిలిచాడు అలెగ్జాండరు
ఏలుదామనుకొనేసరికి
జీవితం ముగిసిపోయింది

పశువుల మేతకోసం
గడ్డి సృష్టించాడు దేవుడు
దాన్ని కూడా భక్షిస్తున్నాడు
నాగరిక మానవుడు

జ్ఞానాన్ని సముపార్జించి
మహాజ్ఞాని అయాడు
అరిషడ్వార్గలకు లొంగి
పతనమయాడు

ధర్మాన్ని రక్షించు
అది నిన్ను రక్షిస్తుంది
రూపాయి ఎరచూపించు
అధర్మం రాజ్యమేలుతుంది

దేశభాషలందు తెలుగులెస్స
తేనెకన్నతీయనైనది తెలుగుభాష
మాతృభాషా దినోత్సవం నాడు మాత్రమే
గుర్తు కోచ్చే పదాలు

కులవృత్తి మానిపించి
డిగ్రీలు చేతికిచ్చారు
ఉద్యోగం రాక, కులవృత్తి చేతకాక
రెంటికీ చెడ్డ రేవడిగ మిగిలారు

తెలుగు భాషకు
ప్రాచీన ప్రతిపత్తి లభించింది
తెలుగు భాషా విశేష పీఠాన్ని
తెలుగు నేలపై నెలకొల్పకపోవటం దురదృష్టం

పున్నామనరక విముక్తుడంటూ
గారాబంగా పెంచుకున్నారు
పోయాక పెట్టే పిండం మాటేమోగాని
పట్టెడన్నం కోసం పలవరిస్తున్నారు

జీవితాన్ని స్వర్గతుల్యం
చేసుకోవడం మనచేతుల్లో పని
చచ్చాక స్వర్గం వస్తుందని భ్రమలోపడి
పోతాం పోతాం అంటారు

నరకాసుర వధ జరిగిన
సంబరానికి దీపావళి వెలుగులు
వేలనరకాసురులున్న నేటి సమాజంలో
వెలుగులు బిక్కుబిక్కుమంటున్నాయి

పిన్న నుండి ముసలివరకు
అందరినీ అలరిస్తోంది క్రికెట్ ఆట
క్రీడాకారుల మ్యాచ్‌ఫిక్సింగ్
దేశ ప్రతిష్ఠను దిగజారుస్తోంది

పువ్వుపుట్టగానే
పరిమళిస్తుంది
పుట్టిన మనిషి దానవుడో
మానవుడో చెప్పలేము

మంచి కవిత్వం రాసి
పేరు ప్రతిష్ఠలు సంపాదించాడు
అసూయా జ్వాలల రొంపిలోపడి
ఆదమరచి ఏ నాడూ నిద్రపోలేదు

ఎమ్‌సెట్‌లో మంచి ర్యాంకు తెచ్చుకుని
పేరున్న కాలేజీలో సీట్లు సంపాదించాడు
రాగింగ్ తట్టుకోలేక
ఆత్మహత్య చేసుకున్నాడు

ఆ కాలనీలో
అందరూ ఆదర్శవాదులే!
మీటింగ్‌లు పెట్టగానే
ఫైటింగ్‌లు మొదలెడతారు

బుల్లి కాళ్లతో ఎదపై తంతుంటే
అనిర్వచనీయమైన అనుభూతి ఆనాడు
గుండెలవిసే చేష్టలకు
నిట్టూర్పుల భారం మోస్తున్నది ఈనాడు

అత్యాధునిక సౌకర్యాలతో
అధునాతన బహుళంతస్తుల మేడ
ఇంట్లోనివారు అమెరికాలో నివాసం
ఇల్లు నిర్మానుష్యం

గోడమీద పెళ్లినాటి ఫొటో
మధుర బంధానికి తీపిగుర్తు
అందవిహీనంగా వుందంటూ
దానిస్థానంలో నేటితరం లేటెస్టు సీనరీ

పల్లెటూళ్ళు
ఆప్యాయతకు పట్టుకొమ్మలు
రాజకీయ రక్త పాతాలకు
అక్కడే పునాదులు

అక్షరాస్యత పెరగాలంటూ
వేదికలెక్కి వుపన్యాసాలు
నిజానికి నిరక్షరకుక్షులే కదా
నేతలకు శ్రీరామరక్ష

నాడిచూసి రోగనిర్ధారణ
చేసేవారు వైద్యులు ఆనాడు
ప్రతి అవయవానికి ఒక
స్పెషలిస్టు డాక్టరు ఈనాడు

బామ్మ మాట ఆలకిస్తే
బ్రతుకు బంగరుబాట
నేటి వారి పరిస్థితి
వృద్ధాశ్రమాలకు పంట

కొత్తయింటి అందం యినుమడించాలని
ఖరీదయిన గోడ గడియారం కొన్నారు
ఖర్చుపెట్టకుండా వచ్చింది కదా అని
సమయాన్ని మాత్రం వృధా చేస్తాడు

అరిషడ్వార్గాలను
జయించిన సర్వసంగ పరిత్యాగి
అహం మాత్రం అతడిని
జయించింది

విదేశీ సంపాదనతో
స్వదేశంలో విలాసవంతమైన ఇళ్లు
వాటికి కాపలాగా
వయసు మళ్లిన మాతా పితలు

ఎవరైనా దుఃఖిస్తుంటే
ఓదార్పుగా కర్చీఫ్ అందిస్తాడు
దానిమీద అతని
వ్యాపార ప్రకటన ముద్రితం

దట్టమైన మబ్బుల్నిచూసి
రైతు కన్నుల్లో ఆశావీచికలు
పెనుగాలి వచ్చి
తనవెంట మబ్బుల్ని తన్నుకుపోయింది

అతడు వుపన్యాస చక్రవర్తి
బిరుదాంకితుడు
ఒక్కొక్కసారి జయంతి సభలో
వర్ధంతి గురించి సంభాషిస్తారు

ప్రపంచంలో ఏ మూలవున్నా
ఆప్యాయంగా పలకరిస్తుంది సెల్
సరుకుల కంటే అధికమవుతున్నది దాని బిల్
జేబుకు పెడుతోంది చిల్లు

'నిన్ను ప్రేమిస్తున్నానన్నాడు'
ఆమె సర్వస్వం అర్పించుకుంది
మోసగించడం అతని అలవాటు
అమాయకంగా నమ్మడం ఆమె పొరపాటు

మహోత్కృష్టమైనది
మానవజన్మ
ఏ జీవనరాశిలోనూ లేని కులమతాల
అడ్డుగోడలు మనిషి జన్మకే సొంతం

ఆంధ్రదేశం
అన్నపూర్ణ
ప్రపంచబ్యాంక్
అప్పుల్లో ముందంజ

అపార్టుమెంట్లల్లో అందరూ కలిసి
సందడిగా పండుగలు జరుపుకుంటారు
కష్ట సమయంలో ఆదుకునేందుకు
కులగోత్రాలు తవ్వుకుంటారు

విమర్శకాగ్రేశుడిగా
వినుతికెక్కాడు
ప్రాచీనగ్రంథాలలో బూతులువెతికి
విలువను తగ్గించుకున్నాడు

"ఆరోగ్యశ్రీ" పథకం ద్వారా
పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం
ఉన్నవాడు కూడా
లేనివాడిలా నాటకమాడుతున్నాడు

రూపాయి రూపాయి కూడ బెట్టి
పెద్ద చదువులు చదివించింది
రూపాయి మీద ప్రేమ
అమ్మ ప్రేమను జయించింది

అమ్మానాన్నలు
బండిచక్రాల వంటివారు
బండిపై బరువును మోపటానికే
కొందరు పిల్లలు ప్రయత్నిస్తుంటారు

పొట్టి శ్రీరాములు త్యాగనిరతితో
తెలుగు వారికొక రాష్ట్రం ఏర్పడింది
ఒక్క జిల్లాకు ఆయన పేరు పెట్టడానికి
నిరాహారదీక్షలు చేపట్టాల్సి వచ్చింది

సమాజసేవ చేయాలనే సత్సంకల్పంతో
వృద్ధాశ్రమం కట్టించాడు
మొట్టమొదటగా అందులో
అతనే చేరవలసి వచ్చింది

ప్రేమ జంటకు
పెద్దల అంగీకారం లభించింది
అమ్మలక్కల నోళ్లకు
మాత్రం తాళం పడలేదు

నగరం నడిబొడ్డులో
ఠీవిగా అందాల హుసేన్‌సాగర్
రసాయన కాలుష్యాలకు బలిపశువై
దుర్గంధ భరితంగా మారింది

ఆకాశం నాన్న
అవని అమ్మ
రెంటినీ కబళించాలని
చూస్తున్నారు నేటి సంతానం

అతడి హృదయం
ఎంతో విశాలం
అందుకే! ఇద్దరు భార్యలకు
చోటిచ్చాడు

శరీరంలో అన్ని భాగాలను
సక్రమంగా నడిపిస్తుంది మనసు
తన నడక మాత్రం
వంకరటింక

వారిద్దరిదీ
అన్యోన్యదాంపత్యం
నీది 'నాది' అనే పదాలు
మధ్యలో దూరి వారిని దూరం చేశాయి

గురుబ్రహ్మ గురుర్విష్ణు
అంటూ పాఠాలు చెప్పాడు
క్లాసు వదలగానే
కీచకుడిగా మారాడు

స్వచ్ఛమైన పాలను
ఇస్తుంది పశువు
వాటిని కల్తీ చేసి
అమ్ముతాడు నరపశువు

స్వేచ్ఛగా బతకాలని
కలలుకన్నాడు
సమాజానికి భయపడుతూనే
జీవితం ముగించాడు

శక్తియుక్తులు సంపాదించి
సర్వశ్రేష్ఠుడయాడు
సౌందర్య శక్తికి తలవంచి
దాసోహమన్నాడు

సుస్థిర ప్రభుత్వ
దేశాభివృద్ధికి దోహదం
అస్థిరపరిస్తే
పదవుల బేరం పెట్టవచ్చనే ఆరాటం

జ్ఞాపికలు
ఓ ఘనతకి మెప్పుకోలు చిహ్నాలు
అసూయా జ్వలిత కనులకు మాత్రం
అవి ప్రాణంలేని చెక్కముక్కలు

హ్యాపీ న్యూ ఇయర్ అంటూ
సంబరాలు చేసుకున్నారు
తెల్లారి దినపత్రికల్లో వార్త
కొత్త సంవత్సర వేడుకల్లో విషాదం

ఆ నాయకుడెప్పుడూ
కాలు కిందపెట్టి ఎరగడు
శిలా విగ్రహంగా మారాక
ఎండలో వానలో నిలుచునేవున్నాడు

వీధికొక్కబడి వెలుస్తున్నది
విద్యార్థుల సంఖ్య కూడా పెరుగుతోంది
విద్య మాత్రం
బక్క చిక్కి పోతోంది

నీతి నిజాయితీ గల
ఆఫీసరు
అందుకే అతడిని ఏ పోస్ట్‌లోనూ
ఆరు నెలలకంటే ఎక్కువ వుంచరు

భవిష్యత్తుకు పునాది వేసుకోవడం
ఉత్తముల లక్షణం
భవిష్యత్తే అంధకార బంధురం
కొందరు దురదృష్టవంతులకు

మనిషి ప్రణాళికాబద్ధంగా జీవించడానికి
మతం ఉపయుక్తంగా వుంటుంది
ఆ మతమే నేడు మరణహోమానికి
సమిధగా మారింది

విద్యా ప్రమాణాలకు
కొలబద్దలు డిగ్రీలు
అంగట్లో సరుకుల్లాగా
కొనుక్కుంటున్నారు వాటిని

# రచయిత్రి పరిచయం

| | | |
|---|---|---|
| పేరు | : | **కేతవరపు రాజ్యశ్రీ** |
| శ్రీవారు | : | **కె. మాధవరావు** |
| తల్లిదండ్రులు | : | శ్రీమతి ప్రభావతి, కీ.శే. మహాకాళి వెంకటరావు |
| చిరంజీవులు | : | కె.ఎస్.ఎల్. ఫణీంద్ర<br>శ్రీమతి ప్రియాంక శ్రీకాంత్ |
| విద్యాభ్యాసం | : | ఎం.కామ్. (ఉస్మానియా విశ్వవిద్యాలయం) |
| వృత్తి | : | 1977 నుండి ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో వివిధ హోదాలలో పని చేసి ప్రభుత్వ ఉప కార్యదర్శిగా 2011లో పదవీ విరమణ |
| అభిరుచులు | : | రచనా వ్యాసంగం<br>వీణా వాదాన, ఆధ్యాత్మిక ప్రవచనాలు, ఛెస్ ఆడటం, కవితా గోష్టి |
| ముద్రిత రచనలు | : | చిరు సవ్వడులు, గుండె చప్పుళ్లు, ఊహల వసంతం, సిసింద్రీలు, వెన్నెల మెట్లు, నీలోకి నువ్వు, తృప్తీ నీవెక్కడ |
| సంకలన ప్రచురణలు | : | కవితా చేతన, చేతన కథాఝరి, గృహహింసా చట్టం మహిళకు రక్షణ కవచం, పర్యావరణ చిట్కాలు, కలాల కదంబం |
| ఇతర రచనలు | : | కథలు, సామాజిక అంశాలపై వ్యాసాలు, ఆధ్యాత్మిక రచనలు. |
| సహ సంపాదకులు | : | 'సాహితీ కిరణం మాసపత్రిక' |
| గౌ॥ అధ్యక్షులు | : | చేతన సారస్వత వేదిక |
| వ్యవస్థాపక కార్యదర్శి | : | ఆం.ప్ర.సచివాలయ మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం |
| పూర్వ అధ్యక్షులు | : | సంఘమిత్ర లయనెస్ క్లబ్ |
| బిరుదులు | : | ప్రజ్ఞాశ్రీ<br>(శ్రీ కిరణ్ సాంస్కృతిక సమాఖ్య వారిచే)<br>సాహిత్యశ్రీ<br>(అఖిల భారతీయ భాషా సమ్మేళన్, భోపాల్)<br>మదర్ థెరిస్సా అవార్డు<br>( షీ ఫౌండేషన్, హైదరాబాద్ వారిచే) |



'తృప్తీ నీవెక్కడ' పుస్తకావిష్కరణ గావించిన శ్రీమతి జి.డి.అరుణ, ఐ.ఎ.ఎస్., మండలి బుద్ధ ప్రసాద్.



వైసదేవదాసు దంపతులను సత్కరిస్తున్న సందర్భంగా చిత్రంలో శ్రీ కిరణ్ సమాఖ్య అధ్యక్షులు లంకా సుబ్రహ్మణ్యం, శ్రీమతి బాను, లయనెస్ భారతీ కమలాకర్, పెద్దూరి వెంకటదాసు



ఊహల వసంతం రాష్ట్రస్థాయి బహుమతి ప్రదానం సందర్భంగా శ్రీవారు కేతవరపు మాధవరావు పుష్పమాలతో సత్కారం



మాతృమూర్తి యం. ప్రభావతి గారిని సత్కరించిన సందర్భంగా



# BOMMA BORUSU

BY

KETHAVARAPU RAJYASRI

అపార్టుమెంటు నిర్మాణం
ఎందరికో ఉపాధి కల్పించింది
నిరుపేదలకు
నిలువనీడపోయింది

విదేశీ సంపాదనతో
స్వదేశంలో విలాసవంతమైన ఇళ్లు
వాటికి కాపలాగా
వయసుమళ్లిన మాతాపితలు

సముద్రపు అలల సయ్యాట
ఎంతో ఆహ్లాదకర దృశ్యం
ఆ అలలు తీరం దాటితే
ప్రకృతి విలయ తాండవం

SAHITHIKIRANAM PRACHURANALU